
చీమకుర్తిలో దీపారాధన చేస్తున్న బూచేపల్లి దంపతులు


కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో అధిక సంఖ్యలో భక్తులు



ఒంగోలులోని పాపాకాలనీ దుర్గామల్లేశ్వరి దేవస్థానం ఆవరణలో జ్వాలాతోరణం


పాహిమాం పరమశివా..

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు
- మార్మోగిన శివనామస్మరణ
- వైభవంగా జ్వాలాతోరణం

ఒంగోలు మెట్రో: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఒంగోలు నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు పెద్ద ఎత్తున ఆలయాల్లో కార్తీక దీపాలను భక్తులు వెలిగించారు. శివనామస్మరణ మార్మోగింది. ఆలయాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తులతో రద్దీగా మారాయి. మహిళలు అధిక సంఖ్యలో చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవస్థానం అధికారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంలోని శైవక్షేత్రాలలో ప్రాతఃకాలంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ఉపవాస దీక్షలతో సాయంత్రం కూడా కాశీవిశ్వనాథుడి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.


మర్రిచెట్టుకాలనీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శివలింగం


పుష్పాలంకరణలో కాశీనాథుడు


శ్రీగిరిలో దీపాల వెలుగులో పరమేశ్వరుడు

శ్రీగిరిలో ఆధ్యాత్మిక శోభ...

ఒంగోలు శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం శుక్రవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు భారీగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి ఆలయంలో సహస్ర దీపోత్సవం కార్యక్రమాన్ని భక్తజనులు నయనానందకరంగా నిర్వహించారు. శ్రీవారి తిరునామాలు, శంకుచక్రాల ఆకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు.

కొత్తపట్నం బీచ్‌లో పుణ్యస్నానాలు

- సముద్ర స్నానాలు ఆచరించిన సుమారు 16 వేల మంది భక్తులు

కొత్తపట్నం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల బీచ్‌లలో భక్తులు శుక్రవారం భారీ సంఖ్యలో కార్తీక స్నానాలు ఆచరించారు. అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు గురువారం అర్ధరాత్రి కూడా కొనసాగాయి. అయినప్పటికీ శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచే బీచ్‌లకు భారీగా భక్తులు చేరుకున్నారు. భక్తులు సముద్రం స్నానం చేస్తుండగానే మధ్యమధ్యలో వర్షం కురిసింది. ఉదయం 6 గంటలకు వర్షం నిలిచిపోవడంతో ఒక్కసారిగా కొత్తపట్నం బస్టాండ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు జనసంద్రంగా మారింది. భక్తులు భారీగా పోటెత్తారు. రోడ్డు మొత్తం వాహనాలతో నిండిపోయింది. అధిక సంఖ్యలో మహిళలు, మాలధారులు ఇసుకతో శివలింగాలు చేసి అలంకరించి కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. సముద్రంలో దీపాలు వదిలారు. అనంతరం కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరు, పాదర్తి శివాలయాల్లో పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చీమకుర్తిలో వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

- పాల్గొన్న బూచేపల్లి దంపతులు

చీమకుర్తి రూరల్: కార్తీక పౌర్ణమి వేడుకలను చీమకుర్తి మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చీమకుర్తి, రామతీర్థంలోని ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చీమకుర్తి శివాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందిని దంపతులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. జ్వాలాతోరణం వేడుకల్లో పాల్గొన్నారు. రామతీర్థంలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. దీపాలు వెలిగించి పూజలు చేసి ఆదిదంపతుల ఆశీర్వాదాలు అందుకున్నారు. యోగివేమనరెడ్ల సేవా సమితి ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. సమితి అధ్యక్షుడు మారం వెంకారెడ్డి, సహాధ్యక్షులు ఇలవల విజయమోహన్‌రెడ్డి, బారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సహ కార్యదర్శి సంగన భికెరెడ్డి, కోశాధికారి చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, గౌరవ సలహాదారు అంబటి వీరారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, బడే అయ్యప్పరెడ్డి, క్రిష్టిపాటి కోటిరెడ్డి, గంగిరెడ్డి పెద వెంకటరెడ్డి, బడే దశరథరామిరెడ్డి, మారం వెంకటసుబ్బారెడ్డి, పాలవెల్లి సింగారెడ్డి పాల్గొన్నారు. దాదాపు 7 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

చీమకుర్తి హరిహరక్షేత్రంలో జ్వాలాతోరణం...

చీమకుర్తి: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి చీమకుర్తిలోని హరిహరక్షేత్రం వద్ద జ్వాలాతోరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్, వారి కుటుంబ సభ్యులు, చీమకుర్తి పట్టణంలోని వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. తొలుత శిద్దా రాఘవరావు, వారి కుటుంబ సభ్యులు హరిహరక్షేత్రంలోని సర్వదేవతలకు పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


చీమకుర్తి ఆలయంలో భారీగా భక్తులు

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక గంగా పార్వతీ సమేత త్రిపురాంతకస్వామి శివాలయంలో శుక్రవారం జ్వాలాతోరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఎండోమెంట్ ఈవో ఎస్.నారాయణరెడ్డి, ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబుశర్మ పర్యవేక్షించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


కొత్తపట్నం సముద్రతీరంలో ఇసుకతో శివలింగాలు తయారు చేసుకుంటున్న యువతులు


అయ్యప్పస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


రామతీర్థంలో వనభోజనాలలో పాల్గొన్న భక్తులు


సముద్రంలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు


రామతీర్థంలో వనభోజనాలను ప్రారంభిస్తున్న యోగివేమన రెడ్ల సేవా సమితి సభ్యులు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

డిసెంబర్ 5 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సంతనూతలపాడు: సంతనూతలపాడు హైస్కూల్లో డిసెంబర్ 5, 6, 7, 8 తేదీల్లో సూదునగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సూదునగుంట కృష్ణమూర్తి, తదితరులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఒంగోలులో సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను పోటీలకు వారు ఆహ్వానించారు. ఎన్నారై డాక్టర్ సూదునగుంట రాఘవేంద్ర ప్రసాద్ సూదునుగుంటఫౌండేషన్ అమెరికా ఆధ్వర్యంలో సంతనూతలపాడు హైస్కూల్లో ఫ్లడ్ లైట్ల మధ్య రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 400 మంది కిపైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ఒంగోలు: కబడ్డీ పోటీల బ్రోచర్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం తన చాంబరులో ఆవిష్కరించారు. కబడ్డీ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, సూదనగుంట కృష్ణమూర్తి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు అన్ను వేణుగోపాల్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఎన్‌టీయూ క్రీడా పోటీలు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ, క్రికెట్ పోటీలను ఈ నెల 16, 17 తేదీల్లో తమ కాలేజీలో నిర్వహించనున్నట్లు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ కార్యదర్శి శిద్దా హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని 21 కాలేజీల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. క్రీడాకారులకు అవసరమైన రవాణా, వసతి, భోజన సదుపాయాలన్నింటికీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విజేతలు ఈ నెల 26 నుంచి 30 వరకు కొట్టాయంలో జరిగే దక్షిణ భారత అంతర కళాశాలల పోటీల్లో పాల్గొంటారన్నారు.

సమ్మె నోటీసు అందజేత

నాగులుప్పలపాడు: అత్యవసర సేవలైన 108, 104 వాహనాలలో పనిచేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి సమ్మెకు సహకరించాలని 108 పైలెట్ వీరాంజనేయులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం తమ సేవలు వినియోగించుకుంటూ తమ కనీస ఉద్యోగ కోర్కెలు నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అందుకు నిరసనగా తమ నాయకులు సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.


ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న సిబ్బంది

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి జీపీడీపీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో జ్యోతి సూచించారు. శుక్రవారం ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ జీపీడీపీ విధానం గురించి వివరించారు. దీనిపై టీఓటీ శిక్షణ పొందిన రాజువారిపాలెం కార్యదర్శి జి.శ్రీకాంత్, కీర్తిపాడు గ్రామ కార్యదర్శి ఆశాలత, ఏడుగుండ్లపాడు డీఏపీ శిరీష్ శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖాధికారి రమేష్, ఈవోపీఆర్డీ రఘుబాబు, పంచాయతీరాజ్ ఏఈ రవిబాబు, ఏపీవో కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమాయత్తం కావాలని చీమకుర్తి ఈవోపీఆర్డీ పి.అజిత సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామైక్య సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల గురించి మాస్టర్ ట్రైనీలు వెంకటేశ్వర్లు వివరించారు. 29 శాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చాకు ముఠా కూలీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

సంతనూతలపాడు: పచ్చాకు ముఠా కూలీలకు ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పచ్చి పొగాకు ముఠా కూలీల రక్షణ చట్టం కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో 4.5 కోట్ల మంది ఈ పంట ఆధారంగా వివిధ రకాల పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దేశంలో 750 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుండగా, ఆంధ్రప్రదేశ్లో 215 మిలియన్ కిలోలు పండుతోందని తెలిపారు. అందులో ప్రకాశం జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో 100 నుంచి 150 మిలియన్ కేజీల పొగాకు పండుతోందని చెప్పారు. కూలీలకు కూడా కొంత ఉపాధి కల్పించే ఈ పనిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చట్టం చేయాలని కోరారు. కూలీల శ్రమ ద్వారా ఇంత ఆదాయం వస్తున్నప్పటికీ.. పచ్చాకు ముఠా కూలీలకు కనీస రక్షణ చట్టాన్ని తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మాబు సుభానీకి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు అన్నవరపు శేషారావు, నాయకులు, ముఠా మేస్త్రీలు, కూలీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న పీడీ వసుంధర

ఒంగోలు వన్‌టౌన్: పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ (డీఆర్డీఏ) పీడీ టి.వసుంధర అన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టెక్నికల్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వెలుగు ఆధ్వర్యంలో యూనిసెఫ్ సంస్థ సహకారంతో జిల్లాలోని ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ శిక్షణ పొందిన సిబ్బంది వీఓఏలు, ఎస్‌హెచ్‌జీ లీడర్లు, హెల్త్ పాయింట్ పర్సన్లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రూపు సభ్యురాలిని ఆరోగ్యంగా కూడా బలోపేతం చేయాలన్నారు. ఏపీఎంలు ఆదిశేషు, లక్ష్మీనారాయణ, గోపాలకృష్ణ, నరేంద్రకుమార్, పిచ్చయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తలకు నివాళులు

ఒంగోలు మెట్రో: ఇటీవల మరణించిన సామాజిక కార్యకర్తలు చివుకుల శ్రీలక్ష్మి, డాక్టర్ అరుణశ్రీ సంస్మరణ సభను స్థానిక హౌసింగ్ బోర్డులోని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వారి సేవలను కొనియాడారు. వారి చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు పేర్నమిట్ట క్రీడాకారులు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట క్రీడాకారులైన ఎస్.గౌతమ్, పి.సమిర్ఖాన్, పి.సుహిరా, టి.చైతన్య, టి.దిలీప్, ఇ.ధీరజ్, బి.కౌశిక్, కె.హర్ష, పి.భరత్, కె,మాధవ్ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17న జరగబోయే 22వ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు.

తైక్వాండో క్రీడాకారిణికి ఎస్పీ అభినందన

ఒంగోలు టౌన్: గత సంవత్సరం డిసెంబరులో తైక్వాండో బ్లాక్ బెల్ట్ పోటీల్లో 1వ డాన్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఒంగోలుకు చెందిన షేక్ సమీరాను ఎస్పీ దామోదర్ శుక్రవారం అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ఎస్పీని కలవగా, అభినందనలు తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని చెప్పారు.


సమీరాను అభినందిస్తున్న ఎస్పీ

నేడు ఒంగోలులో శిక్షణ

ఒంగోలు సిటీ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ట్రూ అప్ చార్జీలతో రూ.20 వేల కోట్ల భారం


చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కే మాబు మండిపడ్డారు. శుక్రవారం చీమకుర్తి బస్టాండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయనతో పాటు సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వాటిని తగ్గించాలని, ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా, మండల నాయకులు పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా సినీ హీరో కృష్ణ వర్ధంతి


కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహిత్యవేత్తలు, కళాకారులు

ఒంగోలు మెట్రో: సూపర్‌స్టార్ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో శుక్రవారం సినీ హీరో కృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణ అభిమానులు, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు, కళాకారుల సంఘాల ప్రతినిధులు పాల్గొని కృష్ణ సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కవి, రచయిత కుర్రా ప్రసాద్, సూపర్‌స్టార్ కృష్ణ పరిషత్ అధ్యక్షుడు జాలాది మోహన్, రంగభూమి కళాకారుల సంఘ నాయకులు దేనువకొండ సుబ్బయ్య, అంగలకుర్తి ప్రసాద్, ఉప ఖజానాధికారి షేక్ అబ్దుల్ ఖాదర్, గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు గంట సుబ్బారావు, ప్రిన్సిపాల్ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మద్దిపాడు నాయకులు


వైఎస్ జగన్‌తో మేరుగు నాగార్జున, మద్దిపాడు మండల నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిపాడు మండల నాయకులు తాడేపల్లిలో కలిశారు. మద్దిపాడు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, తదితరులు కలిసి మండలంలో సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్న విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మపై నమోదైన కేసు గురించి కూడా వివరించారు. జగన్ స్పందిస్తూ సోషల్ మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను తిప్పికొడదామని, ఎవరూ ఇబ్బందిపడాల్సిన అవసరం ఉండదని భరోసా ఇచ్చారు. జగన్‌ను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీలు మేరుగు పద్మ, పల్లకి పెద్దకుమారి, పైనం ప్రభాకర్, సర్పంచ్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు మండవ బాలచంద్రమౌళి, గుడ్డపాతల రవి, నల్లూరి మహేష్, దుడ్డు వినోద్, కంకణాల సురేష్, రావూరి అశోక్, తదితరులు ఉన్నారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు అర్బన్: అధికారులు, ఉద్యోగులు బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఒంగోలు రెవెన్యూ డివిజినల్ అధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్డీఓ కార్యాలయంలో బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం, బాలికల రక్షణ చట్టం, బాల్య వివాహాల చట్టం, బాల కార్మిక నిర్మూలన చట్టం, పిల్లల అక్రమ రవాణా చట్టం, పిల్లలపై లైంగిక వేధింపుల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు సీడీపీఓ రాజకుమారి, బాలల సంరక్షణ లీగల్, ప్రొబేషన్ అధికారి రత్నప్రసాద్, తహసీల్దార్లు, మండల విద్యాశాఖాధికారులు, మండల డెవలప్‌మెంట్ అధికారులు, ఐసీడీఎస్ ఏవో, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ లక్ష్మీప్రసన్న

బీసీల కులగణన చేపట్టాలి

ఒంగోలు వన్‌టౌన్: బీసీల కులగణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం అన్ని ప్రయోజనాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి కోరారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో కలిసి జిల్లాలోని బీసీల సమస్యలపై మాట్లాడారు.

బాలల భవిష్యత్ ఉన్నతంగా ఉండాలి

నాగులుప్పలపాడు: నేటి బాలలే రేపటి పౌరులని, వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని, అందుకోసం తల్లిదండ్రులతో పాటు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. తిమ్మసముద్రం గ్రామంలో కిశోర బాలికలకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలకు యుక్త వయస్సులోనే వివాహాలు చేయకుండా వారు చదువుతో పాటు భవిష్యత్ రంగాలలో రాణించడానికి కుటుంబ సభ్యులు తోడ్పాటునందించాలన్నారు. వారికి ఈ వయస్సులోనే సమాజం నుంచి ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వీఆర్వో అలేఖ్య, అంగన్‌వాడీ వర్కర్లు రమ, పద్మ, రాధమ్మ, లక్ష్మి, మస్తానమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీదేవి